## క్లుప్తంగా

### నేడు భగవద్గీత శ్లోక పఠనం పోటీలు

రాయవరం: మండలంలోని వెదురుపాక గీతా జ్ఞాన మందిరం వద్ద ఆదివారం భగవద్గీత శ్లోక పఠనంపై పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గీతా జ్ఞానమందిరం నిర్వాహకుడు పడాల శివమణికంఠారెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. భగవద్గీత మొదటి, 18వ అధ్యాయాలపై శ్లోక పఠనంపై పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి అధ్యాయంపై జూనియర్స్‌గా, 18వ అధ్యాయంపై సీనియర్స్‌కు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

### సీతారామ క్షేత్రంలో ఏకాదశి పూజలు



స్వామి వారిని అభిషేకిస్తున్న అర్చకుడు వరదాచార్యులు

మండపేట: స్థానిక బురుగుంట చెరువు సీతారామ క్షేత్రంలో కొలువైన సీతారా చంద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం భాద్రపద తొలి ఏకాదశి పర్వదిన కావడంతో సీతారామచంద్రుల వారికి విశేష పూజాధికాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వరదాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు మల్లిపూడి గణేశ్, మల్లిపూడి కొండయ్య కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చనలు అభిషేకాలు జరిగాయి. భక్తుల గోత్ర నామాలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యంలో విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### హిందీ ప్రాధాన్యత దేశ వ్యాపితం



హిందీ కవుల చిత్ర పటాల సమక్షంలో భీమారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: హిందీ భాష ప్రాధాన్యత మొత్తం భారతదేశ వ్యాపితంగా ఉంటుందని మండలంలోని మాచరలో శనివారం నిర్వహించిన హిందీ దివస్‌లో పాల్గొన్న వక్తలన్నారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.వెంకట్రావు ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యమంతా హిందీ భాష ద్వారానే వ్యక్తమవుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. దేశ చారిత్రక పరిణామాలను, భారతీయుల జీవన విధానాలను హిందీ సాహిత్యం తెలియజెబుతోందన్నారు. తులసీదాస్, కబీర్, సుమిత్రా నందన్ పంత్ తదితర హిందీ కవులు అందించిన సాహిత్యాన్ని ఆధునిక భారతీయులు తప్పనిసరిగా అధ్యయనం చేయాలన్నారు. హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్న భీమారావును సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు



నరసాపురపుపేట వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట గణేష్ నగర్‌లో వేంచేసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఏకాదశి పురస్కరించుకుని శనివారం గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. 11 రకాల ద్రవ్యాలతో మహాగణపతి పూజ నిర్వహించారు. అభిషేకాలు, గరిక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### అక్రమాలపై విచారణ చేపట్టాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ డిమాండ్ చేశారు. శనివారం సీతారామపురంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 120 పనులకు గానూ రూ.4.20 కోట్ల అభివృద్ధి పనులను నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడంతో గ్రామానికి చెందిన కొందరు హైకోర్టును ఆశ్రయించారన్నారు. అయితే పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ గతేడాది డిసెంబర్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కోర్టు తీర్పు కారణంగా ఎటువంటి పనులు చేయడం లేదని, బిల్లులు చెల్లించడం లేదని చెప్పారన్నారు. అయితే కోర్టు తీర్పును ధిక్కరిస్తూ ఇటీవల రూ.60.91 లక్షలు నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించారని ఆరోపించారు.

# అర్హులందరికీ ప్రజాస్వామిక ఆయుధం



మండపేటలో ఎన్నికల జాబితా రూపకల్పనపై రాజకీయ ప్రతినిధులతో చర్చిస్తున్న తహసీల్దార్ తేజేశ్వరరావు

- ఓటరు జాబితా రూపకల్పన ప్రక్రియ వేగవంతం
- నియోజకవర్గ స్థాయిలో రాజకీయ ప్రతినిధులతో సమీక్ష
- క్షేత్ర స్థాయిలో శ్రమిస్తున్న బీఎల్‌వోలు

కపిలేశ్వరపురం: ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ఓటు వేయడమనేది వ్యక్తి సామాజిక బాధ్యత. అందుకే భారత ఎన్నికల సంఘం ప్రతి ఒక్క పౌరుడికీ ఓటు హక్కు కల్పించాలని సాధ్యమైనంత వరకూ అవకాశాన్ని ఇస్తూనే ఉంది. గత మేలో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు అనేక విడతలుగా ఓటు హక్కు కల్పించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. అదే ఒరవడితో ఎన్నికల కమిషన్ మరోసారి ఓటు హక్కు క్యాంపెయిన్ చేపట్టింది.

**రెండు నియోజకవర్గాల్లో ఇలా...**

మండపేట నియోజకవర్గంలో 223 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,20409 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,07,179 మంది, మహిళలు 1,13,6224 మంది. ఇతరులు ఆరుగురు ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 2,03,207 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,00,682, మహిళలు 1,02,524 మంది. ఇతరులు ఒకరు ఉన్నారు.

ఈ ఏడాది ఆగస్టు 20న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించింది. అక్టోబర్ 18 వరకూ ఓటు హక్కు నమోదు అవకాశం కల్పిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ల పర్యవేక్షణలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికే జాబితాలో ఓటు ఉన్నప్పటికీ ఏమైనా మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంది. 18 ఏళ్లు నిండిన వారికి కొత్తగా ఓటు హక్కు కల్పిస్తున్నారు. అక్టోబర్ 29న ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేయనున్నారు. డిసెంబర్ 24న అభ్యంతరాలు పరిశీలించనున్నారు. 2025 జనవరిలో తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

### అందరికీ ఓటు హక్కు లక్ష్యం

నియోజకవర్గంలోని అర్హత గల ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న సంకల్పంతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టాం. ఉన్నతాధికారుల ఆదేశాలపై బీఎల్వోలంతా ఓటరు జాబితా రూప కల్పనకు కృషి చేస్తున్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అవతార్ మెహర్‌బాబా, ఎన్నికల ఉప తహసీల్దార్, మండపేట

**2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల వరకూ రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఇలా..**

2014 ఎన్నికల్లో ఓటర్లు ఇలా...

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మండపేట | 96,423 | 99,485 | 07 | 1,95,915 |
| రామచంద్రపురం | 91,482 | 90,128 | 07 | 1,81,617 |
| అమలాపురం పార్లమెంట్ | 6,82,359 | 6,75,065 | 51 | 13,57,475 |

2019 ఎన్నికల్లో ఓటర్లు ఇలా...

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మండపేట | 1,04,851 | 1,09,471 | 02 | 2,14,324 |
| రామచంద్రపురం | 96,712 | 97,023 | 07 | 1,93,742 |
| అమలాపురం పార్లమెంట్ | 7,28,612 | 7,30,147 | 29 | 14,58,788 |

2024 ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు ఇలా...

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మండపేట | 1,07,179 | 1,13,224 | 06 | 2,20,409 |
| రామచంద్రపురం | 1,00,682 | 1,02,524 | 01 | 2,03,207 |
| అమలాపురం పార్లమెంట్ | 7,59,104 | 7,72,285 | 21 | 15,31,410 |

## మిలాద్ ఉన్ నబీకి సర్వం సిద్ధం



మిలాద్ ఉన్ నబీకి సిద్ధమైన వెలంపాలెం షాబాజియా జామియా మసీదు

రామచంద్రపురం రూరల్: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని రేపు మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించనున్నట్లు వెలంపాలెం షాబాజియా జామియా మసదు ప్రెసిడెంట్ సయ్యద్ ఫాజిల్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు షాబాజియా జామియా మసీదు, ద్రాక్షారామలోని జామియా మసీదులను సర్వాంగ సుందరంగా అలంకరించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు షాబాజియా మసీదు నుంచి మహ్మద్ ప్రవక్త జులూస్(ర్యాలీ) ప్రారంభించి ద్రాక్షారామ జామియా మసీదు వరకు ద్రాక్షారామ, వెలంపాలెం వీధుల గుండా నిర్వహిస్తామన్నారు. అనంతరం జామియా మసీదులో మధ్యాహ్నం దావత్ (విందు) జరుగుతుందన్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు వెలంపాలెం షాబాజియా జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం 7.45 గంటలకు పత్యేక దావత్ జరుగుతుందని తెలిపారు.

## దాతకు సత్కారం



దాత అచ్చిబాబును సత్కరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామానికి చెందిన దాత చింతపల్లి అచ్చిబాబును శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గత పదేళ్లుగా అచ్చిబాబు చదువు మీద ఉన్న మమకారంతో కూళ్ల పంచాయతీ పరిధిలోని 3 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్‌ను పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా నోట్ బుక్స్‌తో పాటు పాఠశాలకు గడియారాన్ని బహూకరించారు. దీంతో పాటు పాఠశాల అభివృద్ధికి కూడా నిధులు అందించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు దాత అచ్చిబాబును శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. అచ్చిబాబు మాట్లాడుతూ రానున్న కాలంలో కూళ్ల పంచాయతీ పరిధితో పాటు చుట్టుపక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు నోట్‌బుక్స్ అందిస్తానని తెలిపారు. హెచ్‌ఎం జె.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయుడు పి.గుణవంతుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు శ్రీకారం



విజయదుర్గ ఆలయం వద్ద రాటకు పూజలు చేస్తున్న స్థానికులు

మండపేట: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు పట్టణంలో శ్రీకారం చుట్టారు. స్థానిక 26వ వార్డు గాంధీ నగర్‌లోని శ్రీ విజయదురర్గా అమ్మవారి ఆలయం వద్ద శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఆలయ పూజారి పిచ్చుక రాజు ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించి, రాటను ప్రతిష్ఠించారు. కమిటీ పెద్దలు జొన్నపల్లి సూర్యారావు, యలమంచిలి శ్రీను, కోళ్ల శ్రీను, బండారు కామరాజు, పిల్లా గణపతి టెంకాయలు కొట్టి రాట పూజ చేశారు. పూజారి రాజు మాట్లాడుతూ వచ్చే నెల 3న శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. తమ ఆలయంలో ఈ ఏడాది ముందుగానే రాట ముహూర్తం వచ్చిందన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఏటా ఘనంగా జరుగుతాయన్నారు. ఈ ఏడాదీ అదే మాదిరి ఉత్సవాలు నిర్వహించడానికి కమిటీ ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళలు, అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు

- పెద్దపెద్ద గోతులతో కేశవరం- బొమ్మూరు రోడ్డు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు



కేశవరం గనిపోతురాజు గుడి దగ్గర రోడ్డు దుస్థితి

మండపేట: ప్రజల ప్రాణాలు ఏమైపోతే మాకేంటి అన్న తీరున ఉంది ఆర్ అండ్ బీ శాఖ నిర్లక్ష్యం. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు పైబడినా రోడ్ల దుస్థితిపై దృష్టి సారించలేదు. ఇటు పాలకులు, అటు అధికారుల నిర్లక్ష్యానికి కేశవరం -బొమ్మూరు రహదారి అద్దం పడుతోంది. కేశవరం శివార్లలోని గని పోతురాజు ఆలయం వద్ద నుంచి సంపత్‌నగరం వరకూ ఆ రోడ్డు దారుణంగా ఉంది. ఈ రహదారి పొడవునా భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు ఆ గోతుల్లోకి నీరు చేరింది. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. కాగా జెడ్. మేడపాడు, ఏడిద, మండపేట మెయిన్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండపేట మెయిన్ రోడ్డుపై ఏర్పడిన గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు ఆ గోతుల్లో బకెట్ పెట్టి అందులో మట్టిని కొబ్బరి ఆకులు సూచిక బోర్డులా ఏర్పాటు చేశారు. నాలుగు రోజులైనా అధికారులు గానీ, నాయకులు గానీ పట్టించుకోక పోవడంతో స్థానికులే ఆ గోతులను బిల్డింగ్ వ్యర్థాలతో తాత్కాలికంగా పూడ్చారు. ఏడిద రోడ్డు, మేడపాడు రోడ్డులో కూడా అదే పరిస్థితి నెలకొంది. గ్రావెల్ లారీల రాకపోకలతో కేశవరం రైల్వే గేటు దాటిన తర్వాత కూడా రోడ్డుపై భారీ గోతుల ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే ఈ గోతులు చెరువులను తలపిస్తున్నాయి. దీనిపై ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఆర్ అండ్ బీ అధికారులు తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులతో బైక్‌లతో వెళుతుండగా గని పోతురాజు ఆలయం వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ ఇక్కడ ఆటో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వాహనదారులు, ప్రజలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఛిద్రమైన రహదారులకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రసన్నకుమార్ కోరారు.

### ఆకట్టుకున్న దేవ నర్తకి నాటకం

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో కర్షక గణపతి నవరాత్ర ఉత్సవాల వేదికపై శుక్రవారం సాయంత్రం జరిగిన దేవ నర్తకి నాటక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ప్రముఖ సినీ హాస్య, జబర్దస్త్ నటుడు అప్పారావు, కడప రత్నశ్రీ కాంబినేషన్‌లో నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. నాటకాన్ని చూడటానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా నటుడు అప్పారావు మాట్లాడుతూ ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గుతుందని, ప్రతి ఒక్కరూ నాటకాలను, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం కూనవరం గ్రామస్తులు కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

## పలువురికి మంత్రి పరామర్శ



గొల్లపాలెంలో వెంకటరమణను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, తదితరులు

కాజులూరు: మండలంలోని బందనపూడిలో స్థానిక మాజీ సర్పంచ్ తలాటం బాబులు భార్య తలాటం రమాదేవి గత బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన నేత డేగల సతీష్ తదితరులు బాబులును పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. అనంతరం గొల్లపాలెం శివారు పాపాయమ్మపేటలోరోడ్డు ప్రమాదానికి గురై చేతికి శస్త్రచికిత్స చేయించుకున్న అత్తిలి వెంకటరమణను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పశు బీమా..పాడి రైతులకు ధీమా

- పశువులతో పాటు పలు జీవాలకూ అవకాశం
- ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకూ బీమా



పాడి పశువుతో రైతు

రాయవరం: గేదెను పేదవాడి ట్రాక్టర్‌గా చెబుతారు. వ్యవసాయం తర్వాత రైతులు పాడిపైనే ఎక్కువగా ఆధార పడతారు. గ్రామాల్లో పాడి పరిశ్రమతో జీవనం సాగించే రైతులు ఎక్కువ. పశువులతో పాటు, మేకలు, గొర్రెలను ఎక్కువగా పెంచుకుంటారు. అయితే పశువులు, జీవాలు ప్రమాదవశాత్తూ మృతి చెందితే రైతులు తీవ్రంగా నష్టపోతుంటారు. దీనివలన రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుంది. పాడి రైతులు నష్టపోకుండా పశు సంవర్ధక శాఖ బీమా సదుపాయం కల్పిస్తోంది. ప్రభుత్వం బీమా నిధులను పశువైద్యశాలల వారీగా కేటాయించింది. బీమా సదుపాయం నిమిత్తం పాడి రైతులు కొంతమేర ప్రీమియం సొమ్ము చెల్లిస్తే మిగిలిన సొమ్మును ప్రభుత్వమే చెల్లించనుంది. ప్రీమియం చెల్లించిన రైతులకు మూడేళ్ల పాటు బీమా వర్తింపజేస్తారు. ఈ బీమా సదుపాయం పాడి పశువులతో పాటు మేకలు, గొర్రెలు, పందులకు కూడా వర్తిస్తుంది. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే పశువులు మృతి చెందిన రోజుల వ్యవధిలోనే బీమా పరిహారం పొందే అవకాశముంది.

**అన్ని కేటగిరీల రైతులూ అర్హులే**

పాడి పశువులున్న రైతులు బీమా పొందేందుకు అర్హులే. అయితే దారిద్ర్య రేఖకు దిగువన, ఎగువన ఉన్న ఉన్న రైతులకు ప్రీమియంలో రాయితీ వర్తిస్తుంది. పాడి రైతులు బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్, రేషన్ కార్డులను జత చేయాలి. బీమా చేసిన పశువుల చెవులకు ట్యాగ్ గుచ్చుతారు. పశువులు ప్రమాదవశాత్తూ మరణించే సమయంలో ఈ ట్యాగ్ ఉండాలి. బీమా చేసిన పశువును ఇతరులు ఎవరైనా కొనుగోలు చేస్తే వారి పేరిట మార్పు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. ప్రస్తుతం పశు సంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులతో బీమా చేయించే పనిలో ఉన్నారు.

**క్లస్టర్ పరిధిలో పశువుల సంఖ్య ఇలా..**

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 6,490 ఆవులు, 22 వేల గేదెలు ఉన్నాయి. మేకలు, గొర్రెలు 50 వేల వరకూ ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. వీటన్నింటిని పశు సంవర్ధక శాఖ అధికారులు బీమా పరిధిలోకి తీసుకు రావడం ద్వారా పాడి రైతులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారు.

**పశువుల బీమా ప్రీమియం చెల్లింపు ఇలా..**

| లబ్ధిదారులు | బీమా (రూ) | ప్రీమియం (రూ) | రాయితీ (రూ) | లబ్ధిదారుల వాటా (రూ) |
|---|---|---|---|---|
| బీపీఎల్ | 15,000 | 960 | 768 | 192 |
| | 30,000 | 1920 | 1536 | 384 |
| ఏపీఎల్ | 15,000 | 960 | 480 | 480 |
| | 30,000 | 1920 | 960 | 960 |
| గొర్రెలు, మేకలు, పందులు ఏడాదికి .. | | | | |
| బీపీఎల్ | రూ.6 వేలు | రూ.180 | రూ.144 | రూ.36 |
| ఏపీఎల్ | రూ.6వేలు | రూ.180 | రూ.90 | రూ.90 |

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు బీమా చేయించు కోవడం ద్వారా మేలు కలుగుతుంది. ఒకసారి బీమా ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు బీమా కవరేజ్ ఉంటుంది. ప్రమాదవశాత్తూ మృతి చెందిన పశువులకు బీమా వర్తిస్తుంది. గరిష్ఠంగా ప్రతి లబ్ధిదారుడికి ఐదు పశువులకు బీమా ఇస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అడబాల నాగశ్రావణి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, వెటర్నరీ డిస్పెన్సరీ, మాచవరం, రాయవరం మండలం

## లోక్ అదాలత్‌లో 322 కేసుల పరిష్కారం



అమలాపురంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 322 కేసులు పరిష్కారం అయ్యాయి. అమలాపురం జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకున్నారు. పరిష్కారమైన 322 కేసుల్లో 30 సివిల్ కేసులు, 236 క్రిమినల్ కేసులు, 12 బీఎస్ఎన్ఎల్ కేసులు, 11 బ్యాంక్ కేసులు, 33 రోడ్డు ప్రమాదాల కేసులు ఉన్నాయి. మొత్తం రూ.3,46,33,672 విలువైన కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడతగ్గ కేసుల్లో మాత్రమే రాజీ ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అదాలత్‌కు విశేష స్పందనతో వందలాది మంది కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో రాత్రి 7.30 గంటల వరకూ సాగింది. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయి కుమారి, ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు, అదాలత్ సభ్యులైన న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.